www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 24 | సెప్టెంబర్ | 2025 పేజీలు : 7

## ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ


2లో

# నకిలీ పాసుపుస్తకాల గుట్టురట్టు



**-పోలీసుల అదుపులో ముఠా**
**-కోట్ల రూపాయల వసూళ్లు**

**ప్రజాపక్షం/ ఖమ్మం/ కూసుమంచి :** నకిలీ పాసుపుస్తకాల గుట్టు రట్టయింది. ఎట్టకేలకు కొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల పాసుపుస్తకాలు ఇప్పిస్తామని ఈ ముఠా కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు సమాచారం. డబ్బులు ఇచ్చిన రైతుల ఒత్తిడి మేరకు వీరే ఒక కంప్యూటర్, ప్రింటర్‌ను ఏర్పాటు చేసుకుని నకిలీ పాసుపుస్తకాలను తయారు చేసి రైతులకు అందించినట్లు తెలుస్తుంది. కూసుమంచి మండలం జక్కేపల్లికి చెందిన ఒక రైతు ఫిర్యాదుతో కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో ఐదుగురిపై కేసు నమోదైంది.

మిగతా 2లో..

## మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీకుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డిపిఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచార వ్యూహాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించి అమలు చేయాలన్నారు. జిల్లాలోని విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో వైద్యాధికారుల సహాయ సహకారాలతో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్సతోపాటు కౌన్సిలింగ్ అందించే చర్యలు తీసుకోవాలన్నారు. డి అడిక్షన్ సెంటర్ ద్వారా అవసరమైన వైద్య సదుపాయాలు అందించాలన్నారు. అటవీ అధికారులు మారుమూల గ్రామాల్లో గంజాయి సాగుపై దృష్టి సారించాలని, సాగు చేస్తున్నట్లు తెలిస్తే

మిగతా 2లో..

## విలీన గ్రామాల అభివృద్ధికి కృషి



**-మౌలిక వసతుల కల్పన**
**-నీరు నిల్వ ఉండకుండా పటిష్ట చర్యలు**
**-అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఆరవ డివిజన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. రూ. 1.46 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్లు, సిసి డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం కార్పోరేషన్‌లో విలీనమైన గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. విలీనమైన ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణం త్వరితగతిన జరుగుతుందని దానికి అనుగుణంగా రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. ఆరవ డివిజన్ పరిధిలో పూర్తి స్థాయిలో డ్రైన్లు, రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. నగరంలో ఖాళీ స్థల యజమానులు బాధ్యత తీసుకుని వారి స్థలాల నుంచి దుర్వాసన, దోమలు రాకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వలేకుండా భూమి లెవలింగ్ చేయాలని లేని పక్షంలో కార్పోరేషన్ తరుపున చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని

మిగతా 2లో..

# సత్తుపల్లిలో ఇసుక లొల్లి..!

**ఆంధ్రా, తెలంగాణ అంటూ ఆధిపత్య పోరు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా ఇప్పుడు రెండు రాష్ట్రాల ఇసుక మాఫియాల మధ్య ఆధిపత్య పోరుగా మారింది. సరిహద్దుల్లో తలెత్తిన ఈ వివాదం ఘర్షణలకు, ప్రతీకార చర్యలకు దారితీస్తోంది. ఆంధ్రా లారీలు తెలంగాణలోకి ప్రవేశించగానే ఇక్కడి అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేస్తుండటంతో, ఆగ్రహించిన ఆంధ్రా వ్యాపారులు ప్రతీకారంగా తెలంగాణ లారీలను వెంబడించి మరీ పోలీసులకు పట్టించినట్లు సమాచారం. ఈ ఘర్షణలు ఎంత తారాస్థాయికి చేరాయంటే మంగళవారం తెలంగాణకు చెందిన మూడు లారీలను ఆంధ్రా వ్యాపారులు వెంబడించి పోలీసులకు అప్పగించారని తెలుస్తోంది. లారీ యజమానులు ఆంధ్రా వ్యాపారులను ప్రశ్నించే క్రమంలో వివాదం తారాస్థాయికి చేరి, 'అటెంప్ట్ టు మర్డర్' కేసు నమోదు చేసే వరకు వెళ్ళినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో ఒకటి రెండు ఆంధ్ర లారీలు పట్టుబడినప్పుడు, ఆ నేపాన్ని కొందరు తెలంగాణ లారీ

మిగతా 2లో..

# నకిలీ పాసుపుస్తకాల గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)

వివరాల్లోకి వెళితే... కూసుమంచి మండలం జక్కేపల్లికి చెందిన అంజిరెడ్డికి కొంత భూమి రికార్డుల్లోకి ఎక్కలేదు. అదే గ్రామానికి చెందిన కొత్తా జీవన్‌రెడ్డి అంజిరెడ్డితో తాను పాసుపుస్తకం ఇప్పిస్తానని తనకు కొంత మొత్తం ఇవ్వాలని చెప్పడంతో రైతు అంజిరెడ్డి జీవన్‌రెడ్డికి పైకం ముట్టజెప్పాడు. ఎన్ని రోజులు గడిచినా పాసుపుస్తకాలు రాకపోవడంతో పలుమార్లు జీవన్‌రెడ్డిని ప్రశ్నించాడు. ఈ క్రమంలోనే ఇద్దరిది ఒకే గ్రామం కావడంతో పలువురు జీవన్‌రెడ్డి వద్దకు వచ్చి పాసుపుస్తకాల విషయమై ఘర్షణ పడుతుండటం చూసి ఇక తనకు పాసుపుస్తకం రాదని నిర్ణయించుకుని కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో అంజిరెడ్డి ఫిర్యాదు చేశాడు. అంజిరెడ్డి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన కూసుమంచి పోలీసులు మంగళవారం ఉదయం ఐదు గంటల సమయంలో గంగబండతండా ప్లైఓవర్ సమీపంలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ పాసుపుస్తకాలు తయారు చేసే వారిగా గుర్తించారు. జక్కేపల్లి గ్రామంలో పలువురి వద్ద పాసుపుస్తకాల పేరుతో డబ్బులు వసూలు చేసి నకిలీ పాసుపుస్తకాలు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైందని ఎస్ఐ నాగరాజు తెలిపారు. అంజిరెడ్డికి సైతం నకిలీ పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఈ కేసులో కూసుమంచి మండలం జక్కేపల్లికి చెందిన కొత్తా జీవన్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా గార్ల బయ్యారంకు చెంది ప్రస్తుతం సాయిగణేష్ నగర్ ఖమ్మం రూరల్‌లో ఉంటున్న కొండూరి కార్తీక్, పాల్వంచకు చెందిన సాయికుషాల్, భద్రాద్రికొత్తగూడెం జిల్లా లక్ష్మి దేవిపల్లి మండలం ఇందిరానగర్ కాలనీకి చెందిన జక్కపల్లి వరప్రసాద్, ఖమ్మం నగరం మంచికంటి నగర్‌కు చెందిన నందమూరి లక్ష్మ ణ్ రావు లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. నిందితులతో పాటు మహీంద్రా థార్, ఏర్టిగా కారును, 10 నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా నకిలీ పాసుపుస్తకాల గుట్టురట్టు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని నకిలీ పాసుపుస్తకాలు తయారు చేశారు. ఎవరెవరికి ఇచ్చారనే దానిపై విస్తృత చర్చ సాగుతుంది. ఈ ముఠాకు ఇంకా ఎవరితోనైనా లింకులు ఉన్నాయా ఉంటే ఏ మేరకు ఉన్నాయనే దానిపై పోలీసులు దృష్టి సారించారు.



# సత్తుపల్లిలో ఇసుక లొల్లి..!






(మొదటిపేజీ తరువాయి)

యజమానులపై నెట్టి చేతులు దులుపుకున్నారని, అప్పటి నుంచి ఈ పరిస్థితి రణరంగంగా మారిందని కొందరు యజమానులు వాపోతున్నారు. పకడ్బందీ చర్యలుఅక్రమ రవాణాను అడ్డుకోవడానికి అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. సత్తుపల్లి నియోజకవర్గంలో మైనింగ్, టాస్క్‌ఫోర్స్, రెవెన్యూ, పోలీస్ అధికారులు అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ పోలీసులు పదుల సంఖ్యలో ఇసుక లారీలను, టిప్పర్లను పట్టుకుని కేసులు నమోదు చేశారు. రవాణా శాఖ అధికారులు కూడా రాత్రింబవళ్లు తేడా లేకుండా తనిఖీలు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు.రూటు మార్చిన మాఫియాఅధికారుల నిఘా పెరగడంతో ఇసుక మాఫియా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటోంది. గతంలో రాజమండ్రి నుండి లోడ్ చేసుకున్న లారీలు మేడిశెట్టివారి పాలెం, మల్లేశ్వరం, వెంకటాపురం, గ్రీన్ ఫీల్డ్ హైవేల మీదుగా తెలంగాణలోకి ప్రవేశించేవి. కానీ ఇప్పుడు అధికారులు ఈ మార్గాల్లో పటిష్టమైన చర్యలు చేపట్టడంతో, మాఫియా రూటు మార్చి ఏలూరు మీదుగా హనుమాన్ జంక్షన్, నూజివీడు, విస్సన్నపేట చేరుకుని, తిరువూరు నుండి తెలంగాణలోకి ప్రవేశిస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్డర్లు లేక సతమతంఈ ఆధిపత్య పోరు వల్ల లారీ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుండటంతో ఇసుకకు భారీ డిమాండ్ ఉండేది. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి, ఫైనాన్స్ లు కూడా సకాలంలో కట్టగలిగామని యజమానులు చెబుతున్నారు. కానీ ప్రస్తుతం ఇసుకకు డిమాండ్ తగ్గడం, పైగా ఈ ఆధిపత్య పోరు వల్ల వాహనాలను పంపితే కేసులు, ప్రమాదాలు కొని తెచ్చుకోవాల్సి వస్తుందని భయపడుతున్నారు. ఈ పోరులో కొందరు లాభాలు పొందుతుంటే, మరికొందరు కన్నీళ్లు పెడుతున్నారని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మిషన్ భగీరథ కార్మికుడు మృతి



ప్రజాపక్షం/ ఖమ్మం : పాలేరు పరిధిలోని మిషన్ భగీరథలో పనిచేస్తున్న చందనబోయిన గాంధీ (36) అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మిషన్ భగీరథలో నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని ఆర్థిక ఇబ్బందులతో మరణించినట్లు తోటి కార్మికులు అంటున్నారు. పాలేరు సెగ్మెంట్ ఎల్అండ్‌టి సంస్థ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతుందని మిషన్ భగీరథ కార్మికులు ఆరోపించారు. ఇదిలా ఉండగా గాంధీ కుటుంబ సభ్యులకు రెండు నెలల వేతనాన్ని ఇచ్చేందుకు ఎల్అండ్‌టి సంస్థ ముందుకు వచ్చినట్లు సమాచారం.

## ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించండి

**-సిపిఐ డిమాండ్**



ప్రజాపక్షం/ ఖమ్మం : కలకోటలో నిర్మించిన ఎస్సి భూములకు నీరు అందించే ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలని సిపిఐ బోనకల్ మండల సమితి డిమాండ్ చేసింది. రాళ్లవాగుపై నిర్మించిన ఎత్తిపోతల పథకం నిరూపయోగంగా మారిందని మండల సమితి తెలిపింది. మంగళవారం సిపిఐ ప్రతినిధులు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యంగల ఆనందరావు మాట్లాడుతూ లక్షలాది రూపాయలు ఖర్చు చేసి 600 ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారని ప్రస్తుతం నిరూపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటుందన్నారు. ఎత్తిపోతల పథకం క్రింద ఉన్న సాగురైతులందరూ చిన్న, సన్నకారు రైతులని ఆయన తెలిపారు. గుత్తేదారు నాసిరకం పైపును వాడటం, తక్కువ లోతులో వేయడం వల్ల ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండేళ్ల నుండి ఈ పథకం రైతులకు సాగునీటిని అందించడం లేదని తక్షణం దీనికి మరమ్మతులు చేపట్టి సాగునీటిని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆనందరావు డిమాండ్ చేశారు. ప్రతినిధి బృందంలో సిపిఐ నాయకులు మాతంగి శ్రీనివాసరావు, అచ్చయ్య, మాతంగి జనార్థన్, రాకేష్, రైతులు ఆనందరావు, తోటపల్లి దావిద్, గోపి, గద్దల శేషారావు, సుధాకర్ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంతే కాకుండా యువతతో రక్తదాన అవగాహన కార్యక్రమాలు కల్పించి శిబిరాలు, అనిమీయ పరీక్షలు నిర్వహించాలని, నర్సింగ్, ఎన్‌సిసి శిక్షణ ద్వారా యువతకు మార్గ నిర్ధేశం చేయాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర పరికరాలు సమకూర్చుకునేందుకు నివేదికలు సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఇల్లెందు డిఎస్‌పి చంద్రభాను, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, ఇంటర్మీడియట్ విద్యాధికాకి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి, రవాణాశాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ

**-బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ దంపతులు**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా మూడో రోజు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సతీమణితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో ఉన్న మహిళలంతా పాల్గొని బతుకమ్మ వద్ద ఆట పాటలతో సందడి చేశారు. గౌరమ్మను పూజించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులు నిర్వహించుకుంటారని కలెక్టర్ తెలిపారు. మహిళలంతా కలిసి కట్టుగా అందరూ ఒకచోటకు చేరి వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి పూజించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణ విద్యార్థినిలు, వైద్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విలీన గ్రామాల అభివృద్ధికి కృషి

(మొదటిపేజీ తరువాయి)



మంత్రి సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకోవాలని తద్వారా భూ గర్బ జలాలు పెరిగి వేసవిలో కూడా నీటి ఎద్దడి ఉండదన్నారు. మన ఇంటి దగ్గర ఖాళీగాఉన్న స్థలంలో మొక్కలు నాటి సంరక్షించుకోవాలన్నారు. నగరంలో చేపడుతున్న నిర్మాణాలను ప్రారంభ దశలోనే అధికారులు పరిశీలించాలని అవి సక్రమంగా ఉన్నాయో లేవో చూడాలన్నారు. రోడ్లను, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ జరిపే నిర్మాణాలను ప్రారంభ దశలోనే అడ్డుకట్ట వేయాలన్నారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా పచ్చదనంతో వెల్లివిరిసేలా ఉండేందుకు ప్రజలు సహకరించాలన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నగరంలో ప్రజల రవాణా మెరుగుపరిచేందుకు సిసి రోడ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామన్నారు. భవిష్యత్తులో నీటి సమస్య రాకుండా ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్టుమెంట్ల నిర్మాణ సమయంలో తప్పనిసరిగా వాన నీటిని ఒడిసి పట్టుకునేవిధంగా సంపు, ట్యాంకులు నిర్మించాలన్నారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకోబు, మున్సిపల్ కార్పోరేషన్ ఇఇ కృష్ణలాల్, అర్బన్ తహసీల్దార్ సైదులు, నాయకులు చావా నారాయణరావు, ఏలూరి శ్రీనివాసరావు, యల్లంపల్లి హన్మంతరావు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసిలో వ్యవసాయ, మార్కెటింగ్, ప్రణాళిక, రవాణా, పోలీస్ శాఖలతో పత్తి కొనుగోళ్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్దతు ధర అందించేలా ప్రతీ అధికారి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 1,72,937 ఎకరాల్లో పత్తి సాగు చేశారని, 26 లక్షల,56వేల,140 క్వింటాళ్ల పత్తి దిగుబడయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. 202526కు గానూ పత్తికి మద్దతు ధర 8110 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయిందని చెప్పారు. పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు సిసిఐ క్రింద ఆరు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తూకం విషయంలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, వ్యవసాయశాఖ అధికారి బాబూరావు, మార్కెటింగ్ శాఖ అధికారి నరేంధర్, తూనికలు, కొలతల అధికారి మనోహర్, రవాణాశాఖ అధికారి వెంకటరమణ సంబంధిత అధికారులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలి



## జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్. రాజశేఖర్ గౌడ్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య ను మరింత పెంచాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్ గౌడ్ సూచించారు. నేలకొండపల్లి, బోదులబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఐసీడీఎస్ సిబ్బంది తో మంగళవారం ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం హాస్పిటల్ లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. ప్రసవాల సంఖ్య ను పెంచేందుకు వారిలో చైతన్యం తీసుకరావాలని సూచించారు. ఈ నెలలో డెలివరి కావాల్సిన 35 మందిని, ఉన్నారని వారిలో కనీసం 10 మంది ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరి లో కాన్పులు జరిగేలా చూడాలని అన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యులు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రవేట్ హాస్పిటల్స్ వైపువెళ్లవద్దని సూచించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రత్యేక దృష్టి సారించి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. ఇందు కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఆక్రమణ కు గురైన హస్పిటల్ స్థలం ను స్వాధీనం చేసుకోవాలని, 50 పడకల ఆసుపత్రి గా అప్ గ్రేడ్ చేసి, అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పసుమర్తి శ్రీనివాస్ వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీయం అండ్ హెచ వో డాక్టర్ చందు నాయక్,పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రమేష్, వైద్యాధికారులు డాక్టర్ మంగళ, శ్రావణ్ కుమార్, యం.డీ.సన, బీ.గౌతమ్, ఐసీడీఎస్ ఏసీడీపీవో రత్నకుమారి, సూపర్వైజర్లు నాగమణి పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన అడిషనల్ డిసిపి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం అడిషనల్ డిసిపి అడ్మిన్‌గా బాధ్యతలు స్వీకరించిన బి. రామానుజం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని అడిషనల్ డిసిపి బి. రామానుజం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

# కేజీకేఎస్ జిల్లా కార్యదర్శిగా కరుణాకర్




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన కొండం కరుణాకర్ కేజీకేఎస్ (తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం) జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సోమవారం ఖమ్మంనగరంలోని మంచికంటి భవన్‌లో జరిగిన జిల్లా 14వ మహాసభలో ఈ మేరకు నియమించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ...కల్లుగీత కార్మికుల అభ్యున్నతి కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా, రాష్ట్రకమిటి అప్పగించిన భాధ్యతపై కృతజ్ఞతలు తెలిపాడు.

# మేయర్, కమిషనర్‌ను కలిసిన ఏఐటియుసి నాయకులు







**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య లను ఏఐటియుసి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాప్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) మహాసభలలో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్రి ఉపేందర్, నక్కెరకంటి కృష్ణ లు మంగళవారం కార్పోరేషన్ కార్యాలయంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు తో కలిసి మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను మేయర్, కమిషనర్ కు పరిచయం చేశారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ ను కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఐ. వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి తాటి నాగరాజు, కోశాధికారి గుండ్ల మహేష్, జిల్లా సమితి సభ్యురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మంగళగౌరీదేవీ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు మంగళవాం శ్రీ మంగళగౌరీ అలంకారం రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దేవాలయ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్‌రరావు మాట్లాడుతూ శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సిబ్బందికి హెల్త్ క్యాంప్




**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ సంపత్‌కుమార్, రమ ప్రసూతి అండ్ జనరల్ హాస్పటల్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ సిబ్బందికి హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా పలు రక్త పరీక్షలు, బిపి, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.మనోరమరెడ్డి, హాస్పటల్ సిబ్బంది, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ రేవతి, శానిటేషన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐటిలో ముగిసిన వర్క్‌షాప్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాల నిర్వహించిన సర్వీస్ నౌ వర్క్ షాప్ ముగిసింది. ప్రముఖ బహుళ జాతి సాఫ్ట్‌వేర్ సంస్థ సర్వీస్ నౌ సర్టిఫికేషన్ ఐదు రోజుల శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ పారిశ్రామిక అనుభవం కలిగిన నిపుణులు ఎం. నోవా పర్యవేక్షణలో ఐదు రోజులుగా సర్వీస్ నౌ వర్క్ షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులకు సిస్టం అడ్మినిస్ట్రేషన్, అప్లికేషన్ డెవలప్‌మెంట్ పై శిక్షణ ఇవ్వడం జరిగిందని ఈ శిక్షణను విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ తమ కళాశాలలో ఎంపిక చేయబడిన చివరి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు వర్క్ షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు సర్టిఫైడ్ సిస్టం అడ్మినిస్ట్రేటర్, సర్టిఫైడ్ అప్లికేషన్ డెవలపర్ వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అమెరికా కేంద్రంగా నిర్వహించబడుతున్న సర్వీస్ నౌ సర్టిఫికేషన్ ద్వారా వివిధ బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. లాజికల్ వైల్ సంస్థ సహకారంతో శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ వాల్‌మార్ట్, అమెజాన్ తో పాటు వివిధ ఫార్చ్యూన్ 500 కంపెనీలు క్లయింట్‌గా కలిగిన సర్వీస్ నౌ తమ కళాశాలను గుర్తించి విద్యార్థులకు సర్టిఫికేషన్ అవకాశం కల్పించిందన్నారు. ఈ శిక్షణ ద్వారా సర్టిఫికేషన్ పొందిన విద్యార్థులకు బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందుతారన్నారు. అనంతరం ట్రైనర్ ఎం. నోవాను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జే. రవీంద్రబాబు, టిపివో ఎస్. సవిత, కో ఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిసిటీ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో పబ్లిసిటీ అసిస్టెంట్ (వీడియో కెమెరామెన్)గా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఏపి, తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ద్వారా జారీ చేసిన సినీ ఫోటోగ్రఫీ అర్హత ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఖమ్మం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఈనెల 25న గురువారం సాయంత్రం ఐదు గంటల లోపు విద్యార్హత గల జిరాక్స్ కాపీలు జతచేసి దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 27,130 వేతనం చెల్లించబడుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

## మధిర రూరల్ సిఐ మధు




**ప్రజాపక్షం/ మధిర :** మధిర నియోజకవర్గ పరిధిలోని ఎర్రుపాలెం, మధిర రూరల్, బోనకల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆంధ్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో వైరా నది,కట్టలేరు ఇతర నదుల నుండి ఇసుకను అక్రమ రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మధిరరూరల్ సిఐ డి.మధు హెచ్చరించారు. మంగళవారం స్థానిక రూరల్ సిఐ కారర్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు మధిర రూరల్ పరిధిలోని అక్రమ ఇసుక రవాణా నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు, సాయిపురం, మాటూరు, రామన్నపాలెం ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు యధాతథంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక వారి వారి ప్రాంతాల్లో వారికి అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. అక్రమ ఇసుక రవాణా నియంత్రణలో ప్రజలు కూడా సహకరించాలని సూచించారు.

# నేడు బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో నేడు బుధవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. బిక్కు, కె. వెంకటరమణ లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరంలోని ఇందిరా నగర్ వద్ద గల తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ హౌజ్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయం వద్ద బతుకమ్మ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖమ్మంలోని అన్ని శాఖల్లో పనిచేస్తున్న నాల్గవ తరగతి మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, నగర, జిల్లా శాఖ కార్యవర్గం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, డిపార్ట్‌మెంట్ యూనిట్ కార్యవర్గ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వరి పంటల తెగుళ్లపై రైతులు అప్రమతంగా ఉండాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : వరి పంటల కు వచ్చే తెగుళ్ల పై రైతులు అప్రమతంగా ఉండా లని నాట్కో రీజనల్ మేనేజర్ నరసింహారెడ్డి సూచించారు. మండలం లోని నాచేపల్లి లో మంగళవారం నాట్కో హెల్త్ సర్వీస్ వారి ఆధ్వ ర్యంలో అవగాహన సదస్సు ను నిర్వహించారు. వరి లో వచ్చే తెగుళ్ల వాటి నివారణ కు చర్యలు...రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట దిగుబడి పెంచటానికి రైతులు తెగుళ్ల నివారణ కు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్లాంజ్ అనే ప్రోడెక్ట్ అద్భుత శిలీంద్రనాశిని ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పాము పొడ, తేగులు ఆకుమచ్చ తెగులు తో పాటు మంచి గింజ. నాణ్యత పంట, దిగుబడి రావటానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలోమార్కెటింగ్ మేనేజర్ ఓబులేస్, రవి తేజ, ధీరావత్ రాధాకృష్ణమూర్తి తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక లారీలు పట్టివేత



ప్రజాపక్షం/దమ్మపేటః అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను దమ్మపేట పోలీ సులు స్వాధీనం చేసుకున్నారు. దమ్మపేట పోలీస్ ఎస్ ఐ బి.సాయి కిషోర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామానికి సమీపంలో రోజువారి విధుల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న సమ యంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కోవూరు ఇసుక రాంప్ నుంచి తెలం గాణ రాష్ట్రానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను మంగళవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. ఈ రెండు లారీలలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక 40 టన్నుల ఉంది అని దాని విలువ సుమారు 40000 రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

## తెలంగాణ అండర్ 15 మహిళా క్రికెట్ ప్రాబబుల్ జట్టుకు దేవిప్రియ ఎంపిక





ప్రజాపక్షం/కరకగూడెంః తెలంగాణ అండర్ 15 మహిళ క్రికెట్ ప్రాబబుల్ జట్టుకు కొత్త గూడెం జిల్లా కరకగూడెం మండలం తాటి గూడెం గ్రామానికి చెందిన బాలిక రామటెంకి దేవి ప్రియ ఎంపికైంది. చదువుతూ క్రికెట్ లో సత్తా సాటి, తెలంగాణ అండర్ 15 మహిళ క్రికెట్ ప్రాబబుల్ జట్టుకు ఎంపిక అవ్వడం పట్ల తల్లిదండ్రులు హనుమంతరావు, ఉమామ హేశ్వరి సంతోషం వ్యక్తం పరిచారు. తండ్రికి క్రికెట్ అంటే చాలా ఇష్టం. క్రికెట్ ఆడుతూ పట్టుదలతో పోటి పరీక్షల్లో సత్తా సాటి ఉపాధ్యాయుడు అయ్యాడు. తండ్రి ప్రభుత్వ ఉపా ధ్యాయుడు అయినా తనలో క్రికెట్ అనే ఆశ అలాగనే ఉండిపోయింది. తన కూతురు దేవి ప్రియ క్రికెట్ ప్లేయర్ చేయాలని నిర్ణయించుకున్నాడు. తండ్రి ప్రోత్సాహంతో హైదరాబాద్ లో నిర్వహించిన మహిళ క్రికెట్ అండర్15 సెలక్షన్ లో దేవి ప్రియ ఎంపికయ్యింది. హెడ్ కోచ్ సురేందర్ రెడ్డి, కోచ్ లు వెంకట్ యాదవ్, బుచ్చిబాబు, రంజి కోచ్ ఇర్ఫాన్ సైతం ప్రత్యేకంగా అభినందించారు. కరకగూడెం మండాలనికి, తెలంగాణ ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.మారుమూల ప్రాంతంలో పుట్టిన దేవి ప్రియ అండర్ 15 మహిళ క్రికెట్ ప్రాబబుల్ జట్టుకు ఎంపిక కావడం పట్ల భద్రాద్రి జిల్లా క్రికెట్ సంఘలు, గ్రామస్తులు, రాజకీయ నాయకులు ప్రత్యేకంగా అభినంధించారు.

## ప్రియదర్శినిలో బతుకమ్మ సంబరాలు





ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదు లాపురంమున్సిపాలిటీపరిధిలోని పెద్దతండాలో గల ప్రియదర్శిని మహిళా సాంకేతిక కళాశాలలో సోమవారం నిర్వహించిన బతు కమ్మ సంబరాలు అంబరాన్నం టాయి. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలు ప్రతిబింబించేలా అధ్యాపకులు, విద్యార్థినిలు వస్త్రా లను ధరించి వేడుకలలో పాల్గొ న్నారు.ఈ సందర్బంగా బతుకమ్మ లను ఒక దగ్గర పేర్చి బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కాటే పల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ బి.గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాధిపతులు, విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల మనోభావాలను దెబ్బతీస్తున్న యాజమాన్యం

**- గుర్తింపు సంఘంతో చర్చించకుండా లాభాల వాటా ప్రకటించడం సరికాదు**
**- ఎస్‌సిడబ్ల్యూయు సెంట్రల్ కార్యదర్శి వంగా వెంకట్**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సింగరేణి యాజమాన్యం ఒంటెద్దు పోకడలతో కార్మికుల మనోభావాలను దెబ్బతీస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్ అన్నారు. మంగళవారం స్థానిక శేషగిరి భవన్‌లో జి వీరస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 20న యూనియన్ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులవు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ తదితరులు కార్మికుల లాభాల వాట, సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసినట్లు తెలిపారు. దీంతో సిపిఎం స్పందిస్తూ డిప్యుటీ సిపిఎం, సింగరేణి యాజమాన్యంతో మాట్లాడండీ అంటూ చెప్పారన్నారు. కానీ సింగరేణికార్మికులను పిలువకుండా ఏక పక్షంగా లాభాల వాటాను ప్రకటించారని చెప్పారు. పిఎల్ఆర్ఎస్ నిర్ణయం కోసం జరగాల్సిన స్టాండర్డైజేషన్ కమిటీసమావేశం జరగ కుండా అంతర్గత తగాదాల ఐఎన్‌టీయూసి కోర్టుకు వెళ్లిందన్నారు. 11వ వేజ్‌బోర్డు కాలంలో కూడా కోర్టుకు వెళ్లారని, ఐఎన్‌టియూసి కార్మికులకు నష్టం చేకూరే పనులు చేస్తుందన్నారు. కార్మికుల సొంతింటి కల పథకంపై సింగరేణి యాజమాన్యం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కృషితో 2009వ సం.లో సర్క్యులర్ జారీ చేసిం దని, ఐనప్పటికీ నేటికి కూడా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అన్యాయం అన్నారు. పెర్క్స్ పై ఇన్‌కం టాక్స్‌ను కోల్ ఇండియాలో మాదిరిగా కంపెనీయే భరించాల్సి ఉండగా, రూ.91 కోట్లు ఖర్చు అవు తుందని చెబుతూ నేటికి కూడా యాజమాన్యం స్పందించడం లేదని,



ప్రభుత్వం కనీసం లాభాల నుండి కూడా టాక్స్ చెల్లించకుండా రూ.4035 కోట్లును ప్రక్కకు పెట్టిందని వారు ఆరోపించారు. మెడికల్ అన్‌ఫిట్ అయి, చనిపోయిన కార్మికుల పిల్లలకు డిపెండెంట్ ఉద్యో గాలు ఇవ్వకుండా 240మంది మెడికల్ ఫిట్ అయినప్పటికీ విటిసికి పంపకుండా అపడం సహించరాని విషయమన్నారు. యాజమాన్యం కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహించకుండా సింగరేణి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. ఇప్పటికైనా కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహించి న్యాయం చేయాలన్నారు. గత ఏడాది సంస్థ అభివృద్ధి కోసం ప్రక్కకు పెట్టిన రూ.2289 కోట్లు దేనిదేనికి ఖర్చు పెట్టారో నేటికి కూడా తెలపలేదని, ఈ ఏడాది ప్రక్కకు తీసిన రూ.4034 కోట్లు దేని కోసం ఖర్చు చేస్తారో వివరాలు తెలపకుండా, కనీసం గుర్తింపు సంఘంతో చర్చించకుండా లాభాల్లో వాటా ప్రకటన చేదయం సరైంది కాదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం రూ.5500 మాత్రమే బోనస్ ఇవ్వడం సరికాదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కొత్త గూడెం కార్పోరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌వి రమణమూర్తి, కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వి మల్లిఖార్జున రావు, కే రాములు, ఎస్ నాగేశ్వరరావు, ఎస్ రాము, ఎస్ శ్రీనివాస్, హుమాయూన్, గోపికృష్ణ, బండారు మల్లయ్య, మాచర్ల శ్రీను, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## లాభాల వాటా ప్రకటనతో మరోసారి కార్మికులకు కుచ్చుటోపీ

**-ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి**
**-నల్ల బ్యాడ్జిలతో కార్మికుల నిరసన**

ప్రజాపక్షం/మణుగూరుః లాభాల వాటా ప్రకటన తో మరోసారి కార్మి కులకు కుచ్చుటోపీ పెట్టిందని ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. 202425 ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ ఆర్జించిన లాభాల్లో కార్మికుల శ్రమకు తగిన ఫలితం దక్క లేదని దానిని నిరసిస్తూ టి బి జి కె యస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ దిశ నిర్దేశం, టి బి జి కె యస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ పిలుపులో భాగంగా మణుగూరు ఏరియా గనులు డిపార్ట్ మెంట్ లలో మంగళవారం పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేయడం జరిగిందని ఆయన తెలి పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ సమైక్య పాలనలో సమ్మెలతో నష్టాల్లో నడచిన సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ పాలనలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘ ప్రత్యేక చొరవతో కార్మిక సంక్షేమ పథకాల అమలు, కొత్త హక్కుల సాధించి సంస్థ అద్భుతమైన ప్రగతి వైపు పరుగులు పెట్టింది అన్నారు. గణనీయమైన స్థాయిలో లాభాలు గడించడం మొదలు పెట్టింది అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో సమిధలై కీలక భూమిక పోషించిన సింగరేణి కార్మికులంటే కేసీఆర్ కు ఎనలేని గౌరవం, ప్రేమ ప్రకృతికి విరుద్ధంగా విధులు నిర్వహిస్తు వారంతా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశానికి వెలుగులు పంచుతున్నా రని సింగరేణి కార్మికుల శ్రమ ఎన్నటికి వెలకట్టలేనిదని కార్మిక శ్రమకు తగిన ప్రతి ఫలం అందించిన గొప్ప మనసున్న నాయకుడు, కార్మిక పక్ష పాతి కేసీఆర్ అని తెలియచేశారు. దసరా పండుగ లాభాల వాటాను ఏ యేడు కా యేడు గణనీయంగా పెంచారు అన్నారు. ప్రతి ఏటా కష్టించి పనిచేస్తూ సంస్థకు గణనీయమైన లాభాలు సాధించి పెడుతున్న కార్మి కులు ఎలాంటి ఆరాటాలు, పోరాటాలు, సమ్మెలు, నిరసనలు చేయకుం



డానే సంస్థ సాధించిన నికర లాభాల్లో నుంచే కార్మికులకు మెరుగైన వాటా అందించారు అన్నారు. ప్రతి కార్మిక వారి కుటుంబ సభ్యుల మోహాల్లో చిరుకాంతులు నింపారు అన్నారు. 202324 అర్థిక సంవత్స రానికి సంస్థ 4701 కోట్లు లాభాలు ఆర్జిస్తే అందులో సంస్థ అభివృద్ధి పేరిట 2289 కోట్లు పక్కన పెట్టి 2412 కోట్ల లాభాలపై 33 శాతం వాటాగా చెల్లించి కార్మికులను మోసం చేయడం జరిగిందని ఆ మోసా న్ని ప్రశ్నించవలసిన గెలిచిన సంఘాలు ఆనాడు వత్తాసు పలికినందుకే నేడు మరోసారి మోసానికి పాల్పడి తడి బట్టతో కార్మికుల గొంతు కోశా యని లక్షల రూపాయలు కార్మికులకు అందకుండా నష్టం చేశాయని ఆయన ఆరోపించారు. సగటున ప్రతి కార్మికుడు 05 లక్షల పైగా నష్టం వాటిల్లిందని గుర్తింపు ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులపై కార్మిక వర్గం గుర్రున ఉన్నారని రానున్న రోజుల్లో మోసపూరిత సంఘా లకు,పాలకులకు కార్మికులు తగిన బుద్ధి చెబుతారని కార్మికులకు జరి గిన అన్యాయం పై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్మిక పక్షాన నిలిచి పోరాడుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వర రావు, సుద్దాల సంపత్ కుమార్ మస్తాన్, సేవా రామాచారి, మురళీ కృష్ణ, జంగం రాజ్ కుమార్ ముకేశ్ కుమార్,కటారి ప్రసాద్, ఇమ్రాన్ నరేష్, వినయ్ కుమార్, శ్రీని వాస్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## రాజకీయాల్లోకి యువత..!

**వారసత్వ రాజకీయాలకు స్వస్తి**



ప్రజాపక్షం/దమ్మపేటః మండలంలో రానున్న ఎన్నికల్లో యువత కీలకపాత్ర పోషించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రానున్న ఎన్నికల్లో వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలుకుతూ కొత్త యువ నాయుకుల పాత్ర చాలా కీలకం కానుంది. గతంలో యువత రాజకీయాలకు దూరంగా ఉంటూ రాజకీయాలు అంటరానివని, అనవసరమని యువత ఫీలౌతున్నారు. నెలకు ఓ లక్ష రూపాయలు జీతం, చిన్న కారు, డబుల్ బెడ్రూమ్ ఫ్లాట్ ఉంటే చాలు. అదే జీవితం అనుకుంటున్నారు. అంతకు మించి ఆలోచించటానికి పెద్దగా ఇష్టపడటం లేదు. దీంతో రాజకీయాలు వంశపారంపర్యం అయిపోయాయి.ప్రస్తుత పరిస్థితులు మండలం లో అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఏ చిన్న అవకాశం దొరికినా యువత రాజకీయాలలోకి ఏ విధంగా ముందుకు సాగాలో అని ఎదురు చూస్తున్నారు,ఏ పని చేస్తి ప్రజలు తమని గుర్తిస్తారు అని అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం దమ్మపేట మండల కేంద్రంలో లో జరు గుతున్న పరిణామాలు చూస్తుంటే కొంత మంది యువకులు తమ ఉనికిని చాటు కునేందుకు ప్రయత్నిస్తున్నారు అనే చెప్పాలి. సోషల్ మీడియాలో ప్రసుత్తం వైరల్ అవుతున్న యువ నాయుకులు ఈ సారి ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా తమకు మంచి జరుగుతుంది అని నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. వారిలో రాజకీయ అనుభవం ఉన్న యువ నాయుకులు కొంత మంది కులం అండ మెండుగా ఉన్న వారు కొంతమంది ప్రజా సమస్యలను గుర్తించి వారి వైపు పోరాడే యువ నాయుకులు కొంత మంది ఉన్నారు.

## కర్మయోగి అభియాన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**

ప్రజాపక్షం/భద్రాచలం : మారుమూల ఆదివాసీ గ్రామాల అభివృద్ధి, మౌళికసదుపాయాల కల్పన కొరకు ఏర్పాటు చేసిన ఆదివాసీ కర్మ యోగి అభియాన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. మంగళవారం భద్రాచలం డివిజన్‌లోని దుమ్ము గూడెం మండలం నడికుడి గ్రామంలో కార్యక్రమంలో భాగంగా ఆది సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం అధికారులు, గ్రామస్తు లతో కలిసి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఓతోపాటు పథకం పరిశీలకులు ప్రదీప్ కుమార్‌ను గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పిల్లలు బతు కమ్మ ఆటలు, యువకులు వాలీబాల్ క్రీడలతో అలరించగా ఆ ప్రాంగ ణంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం పిఓ మాట్లా డుతూ 2030 సం. నాటికి ఆది కర్మయోగి అభియాన్ పథకంలో భాగంగా అన్ని గ్రామచంచాయితీలు అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనకున్నాయన్నారు. ప్రతీ సోమవారం గ్రామాల్లో ఉన్న సమస్యలను చర్చించుకుని ప్రతిపాదనలు తయారు చేసి చివర శనివారం ఇవ్వాలన్నారు. ఆదివాసీ విద్యార్థుల విద్యాభివృద్ధికి,



భవిష్యత్ ప్రాణాళికలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. 2028 నాటికి ఆదివాసీ గిరిజన అన్నిగ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు వచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం సింగవరం, నడికుడి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు వివరించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం తహశిల్దార్, స్పెషల్ ఆఫీసర్ అశోక్ కుమార్, ఎంపిఓ రామకృష్ణ, డిఎంటిలు రాంబాబు, మధవన్, జగదీష్, డిఎంహెచ్ఓ సైదులు, డిప్యుటీ డిఎంహెచ్ఓ చైతన్య, సిడిపిఓ జ్యోతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, ఇతర శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి లాభాల వాటాలో మోసం

**ఏఐటియూసి బ్రాంచి కార్యదర్శి రాంగోపాల్**

ప్రజాపక్షం/మణుగూరుః సింగరేణి లాభాల వాటాలో ప్రభుత్వము, యాజమాన్యం కార్మికులను మోసం చేసిందని ఏఐటియూసి బ్రాంచి కార్యదర్శి కామ్రేడ్ వై రాంగోపాల్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి కేంద్ర కమిటీ పిలుపుమేరకు సెప్టెంబర్ 19వ తేదీన అన్ని జియం ఆఫీసుల ముందు ధర్నా కార్యక్రమం విజ యవంతం చేసిన అనంతరం సెప్టెంబర్ 20వ తేదీన ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు, ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కొమిరి రాజ్ కుమార్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని సింగరేణి లాభాలు ప్రకటించి లాభాల్లో 35 శాతం వాటా, స్ట్రక్చర్, సీఎం డి స్థాయిలో జరిగిన డిమాండ్లను వెంటనే పరి ష్కరించాలని కోరగా గౌరవ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని సంప్రదించమని చెప్పారు అన్నారు. ప్రభుత్వం మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్ కి రమ్మని చెప్పి అక్కడే గుర్తింపు సంఘంతో చర్చించి లాభాలు, వాటా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు అన్నారు. దీనికి విరు ద్ధంగా అక్కడినుండి వేదికను సెక్రటరీ ఎయిట్ మార్చి గుర్తింపు కార్మిక సంఘంతో ఎటువంటి చర్చలు జరపకుండానే ప్రభుత్వం, యాజమాన్యం ఏకపక్షంగా లాభాల వాటాను ప్రకటించారు అన్నారు. గుర్తింపు కార్మిక సంఘంగా ఈ పద్ధతిని ఖండిస్తున్నాము అన్నారు. గడ చిన 23 24 ఆర్థిక సంవత్సరంలో 4701. 3 కంపెనీ లాభాలలో



2412.29 వాస్తవ లాభాలుగా ప్రకటించి అందులో 33 శాతాన్ని 796.06 కోట్లు కార్మికులకు చెల్లించారు అన్నారు. గడిచిన ఆర్థిక సంవ త్సరంలో 6394 కోట్లు కంపెనీ లాభాల్లో చూపించి కేవలం 2360 కోట్లను మాత్రమే వాస్తవ లాభాలుగా చూపించారు అన్నారు. గత సంవ త్సరం కన్నా 1% ఒక శాతం ఎక్కువ చెల్లిస్తున్నామంటూ నికర లాభా లలో తక్కువగా చూపించి సుమారు 52 కోట్లు గత ఆర్థిక సంవత్సరం కన్నా తక్కువగా చూపించి కార్మికులను అంకెల గారడీతో మోసం చేశారు అన్నారు. కావున కార్మిక సహోదరులు వాస్తవాన్ని గమనించగ లరని కోరుతూ గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియూసి గా ఖండి స్తున్నాం అన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ ఎంవి రాం నరసయ్య, ఆఫీస్ బేరర్ ఆవుల నాగరాజు పాల్గొన్నారు.

## ఎంపిడిఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఖాళీ కుర్చీలు

**ఇబ్బందులు పడుతున్న ప్రజలు**



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరులోని ఎంపీ డీవో కార్యాలయం, తహశీల్దార్ కార్యాల యం ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్నాయి. ఆయా పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సూపరిండెంట్ పదవీ విర మణ కాగా, సీనియర్ అసిస్టెంట్ అనారో గ్యంతో మృతి చెందగా ఎంపీ ఓ బదిలీపై వెళ్ల డంతో మూడు కుర్చీలు ఖాళీగా ఉండటం వలన ఆ పనులు చేసేవారు లేకపోవడం వల్ల అన్ని తానై ఆ పనులన్నీ ఎంపీడీవో పై భారం పడటంతో మోయలేని భారం వలన పనులు ఆలస్యంగా జరుగుతు న్నట్లు ప్రజలు తెలుపుతున్నారు. ఆ విభాగాలకు సంబంధించిన పనులు కాక నానా తంటాలు పడుతున్నట్లు ప్రజలు వివరిస్తున్నారు. సంక్షేమం అభివృద్ధి రుణాలు ఇంటి పనులు గ్రామాల అభివృద్ధి తదితర పథకాలు ప్రధానమైన శాఖలు అధికారులు కుర్చీలు ఖాళీగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ రోజులు తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని తెలుపుతున్నారు. ఇదేమని అడిగితే సిబ్బంది లేరు సమయం పడుతుందని మండల శాఖ అధికారి తెలుపుతున్నారు. సిబ్బంది కొర తతో పనులు ఆలస్యం అవుతున్నాయని ఎంపిడిఓ చంద్రశేఖర్ తెలుపు తున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులకు సమాచారం అందించామ ని పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ప్రధానమైన శాఖలు ఖాళీ కుర్చీలతో వెక్కిరిస్తూ ఉండటంతో ప్రధానమైన పనులన్నీ ఆలస్యం అవు తున్నాయని తహశీల్దార్ తెలుపుతున్నారు. డిప్యూటీ తహశీల్దార్ చింత కాని ఇన్చార్జ్ ఎంఆర్ఓగా, జూనియర్ అసిస్టెంట్ అనారోగ్యంతో మర ణించగా మరో సీనియర్ అసిస్టెంట్ బదిలీపై వెళ్లడంతో ప్రధానమైన శాఖలు ఖాళీగా ఉండటం వలన అన్ని పనులు తహశీల్దార్ పై పడటం వలన ప్రజలకు అవసరమైన ప్రధాన మైన పనులన్నీ వాయిదా పడుతూ అవుతున్నాయని ప్రజలు తెలుపుతున్నారు. మూడు శాఖల పనులన్నీ తహశీల్దార్ పై పడటంతో పనులు ఆలస్యం కావడంతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నట్లు తెలుపుతున్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికా రులకు సమాచారం అందించామని తహశీల్దార్ పులి సాంబశివుడు పేర్కొన్నారు.

## లంబాడా నాయకులు అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

**- చందా లింగయ్య హితవు**

ప్రజాపక్షం/భద్రాచలం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భద్రాచలం ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపి సోయం బాబురావుపై భూక్యా సంజీవనాయక్, లంబాడా నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని జాతీయ ఆదివాసీ గిరిజన సంఘాల జేఏసి అధ్యక్షులు చందా లింగయ్య దొర హితవు పలికారు. మంగళవారం స్థానిక గిరిజన అభ్యుదయ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవకాలు చవాకులు మాని వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హెచ్చరించారు. ఆదివాసీ సమాజానికి జరుగుతున్న అన్యాయంపై సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేసేందుకు పిటీషన్ వేయడం జరిగిందని, తెలివిలేని తెల్లం, సోయి లేని సోయం అంటూ లంబాడీలు విమర్శించడం వారి వెర్రి తనా నికి నిదర్శనం అన్నారు. ఏదైనా ఉంటే న్యాయస్థానంలో చేల్చుకోవాలని గానీ అమాయకమైన ఆదివాసీ ప్రజాప్రతినిధులపై లంబాడీలు దాడులు చేయడం వారి చేతగాని తనమే అన్నారు. తప్పుడు ప్రచారాలు, అబ ద్ధాలు మాట్లాడితే ఆదివాసీలు చూస్తూ ఊరుకోరన్నారు. ఈ విష యంపై తక్షణమే జాతీయ స్థాయిలో కమీషన్ ఏర్పాటు చేసి విచారించి ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్ర మంలో పలువురు ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగురాలికి వీల్‌ఛైర్ అందజేత



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఈనెల 16వ తేదీన ఇరవెండి గ్రామ పంచాయితీ పరిధిలోని కొత్తూరులో గల కోసగుంపును సీడీపీవో రేవతి సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా నడవలేని స్థితిలో తీవ్ర ఇబ్బంది పడుతున్న ఓ ఐదు సంవత్సరాల దివ్యాంగురాలైన చిన్నారి కురం సుక్కిని చూశారు. ఈసందర్భంగా చిన్నారి సుక్కి తల్లిదండ్రులతో మాట్లాడారు. చిన్నారి సుక్కి నిలబడటానికి తీవ్ర ఇబ్బంది పడుతుందని, దివ్యాంగురాలు కావడంతో వీల్ ఛైర్ ఉంటే చిన్నారికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వెంటనే సీడీపీవో రేవతి స్పందించి జిల్లాలో సంబంధిత సెక్షన్ వారితో మాట్లాడారు. కాగా మంగళవారం ఐడిఓసీ లో చిన్నారి సుక్కికి వీల్ ఛైర్ అధికారులు అందజేశారు. దీంతో పాప తల్లిదండ్రులు సీడీపీవో రేవతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో చిన్నారి సుక్కి తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్, తదితరులు ఉన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ప్రజాపక్షం/చంద్రుగొండ: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయలై ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘ టన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుగొండ మండలంలోని గానుగపాడు గ్రామానికి చెందిన ఇద్దరు ఎలక్ట్రీషన్లు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందు తుండగా, అందులో మొగిలిపువ్వు నాగరాజు(36)మంగళవారం ఆసుపత్రిలో మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివరామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. మృతుడికి భార్య అజిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## తక్కువ ధరల్లో నాణ్యమైన వైద్యం

ప్రజాపక్షం/జూలూరుపాడు: ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించా లనే లక్ష్యంతో మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఉన్న శ్రీ విజయ్ మెడికల్, జనరల్ స్టోర్‌లో అన్ని రకాల మందులపై 30శాతం తగ్గింపు ప్రకటించారు. వారికి చెందిన శ్రీహరి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో 24 గంటల వైద్య సదుపాయం అందుబాటులో ఉండగా, జ్వరా లకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు కేవలం రూ 250కే చేస్తామని నిర్వాహకులు ఆరె బోయిన కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన మహిళలు, సోదరులు చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ఆ దిశగా తక్కువ ధరల్లో నాణ్యమైన మందులు, పరీక్షలు అందిస్తున్నామని త్వరలో పేద ప్రజల కోసం ఏజెన్సీ గ్రామాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావడమే మా లక్ష్యమని, సేవా కార్యక్రమాలలో పలుపంచుకోవడం మాకు ఆనందంగా ఉందని కృష్ణప్రసాద్ తెలిపారు.

## తెలంగాణ గెజిటెడ్ అధికారుల సెంట్రల్ అసోసియేషన్ మహిళా విభాగం కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/కారేపల్లి: తెలంగాణ గెజి టెడ్ అధికారుల సెంట్రల్ అసోసియే షన్ మహిళా విభాగం కార్యవర్గంలోకి వైస్ ఛైర్ పర్సన్‌గా కారేపల్లి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ విజయ కుమార్, కోఛైర్ పర్సన్‌గా తెలుగు లెక్చరర్ పి సుధారాణిలు ఏకగ్రీవంగా ఎన్నికైన్నారు. తెలంగాణ మహిళా గెజిటెడ్ ఆఫీసర్స్ సమస్యల పరిష్కారానికి ఈ విభాగం పని చేస్తుంది. వీరి ఎంపిక పట్ల తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు తెలుపుతూ ఎన్ విజ య కుమారి, సుధారాణికు కారేపల్లి కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

## లకారం ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి ప్రణాళికలు

**బౌద్ధక్షేత్రం వద్ద ఇరిగేషన్ అధికారులతో స్పెషల్ ఆఫీసర్ సమీక్ష**



ప్రజాపక్షం/నేలకొండపల్లి : దక్షిణ భారతదే శంలో కెల్లా అతి పెద్దదైన బౌద్ధక్షేత్రం ను అభి వృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యచరణ చేప ట్టింది. పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రమేష్ మంగళవారం ఇరిగేషన్ అధికారు లతో కలిసి బౌద్ధక్షేత్రం ను సందర్శించారు. బౌద్ధక్షేత్రం ను అనుకుని ఉన్న చెరువు ను పర్యాటక రంగం పరంగా అభివృద్ధి చేసేం దుకు అవసరమైన చర్యలు గురించి చర్చించారు. ఖమ్మం లోని లకారం ట్యాంక్ బండ్ తర హాలోనే అభివృద్ధి చేయాలని అందుకు తగ్గట్టుగా పనులపై సమీక్ష జరిపారు. చెరువులో బోటింగ్, వాకింగ్ ట్రాక్, జిమ్ ఏరియా, ప్లాంటేషన్, చిల్డ్రన్ పార్క్ తో పాటు ఇతరత్రా అభి వృద్ధి పనుల పై స్పెషల్ ఆఫీసర్ చర్చించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి ఇంకా ఏం చేయాలి. అనే విషయాలను సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ప్రతిపాదనలు, సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, జెఈ లు మదీనా, రుత్విక్, సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాల్లో చెత్త వేయొద్దు

**-చెత్త వాహనం రాకపోతే సమాచారం అందించండి**
**-మున్సిపల్ కమిషనర్ గురులింగం**



**ప్రజాపక్షం/ వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలో వార్డుల్లో ఖాళీ స్థలాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయ్యవద్దని మున్సిపల్ కమిషనర్ గురులింగం తెలిపారు. మంగళవారం విలేకరులతో కమిషనర్ గురులింగం మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో తాను పర్యటించినట్లు తెలిపారు. ఖాళీ ప్లాట్లలో ప్రజలు ఎవరు చెత్త వేయ్యవద్దన్నారు. వార్డుల వారీగా చెత్త వాహనాలు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. చెత్త వాహనం వచ్చేటప్పుడు మైకుల ద్వారా కూడా సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. చెత్త వాహనాలు ఆయా ప్రాంతాలకు వచ్చినప్పుడు గృహవాసుల నుంచి సంతకాలు తీసుకునేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చెత్త వాహనాలు వార్డుల్లోకి రాకపోతే సమాచారం అందించాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వైరా మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు.

# సోలిపురం పంచాయతీకి లక్షల నిధులున్నా.. అభివృద్ధిలో సున్న

**- పీక్వతండా ప్రజలకు మూడు నెలలుగా రాని మిషన్ భగీరథ నీళ్లు**
**- పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు**








**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** ఆంధ్ర పాలకుల పెత్తనంతో నిధులు నియామకాలు లేక పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఇంకా మంచినీటి ఎద్దడి ఏర్పడిందంటే అధికారుల తప్పిదం తేటతెల్లమవుతుంది. పాలేరు నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇలాకలో అసమర్ధ అధికారుల పాలన రాజ్యమేలుతుంది. తిరుమలాయపాలెం మండలం సోలిపురం గ్రామ పంచాయతీ పీక్వతండా గిరిజన ప్రజలు మిషన్ భగీరథ నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్ని సార్లు విన్నవించినా మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామం సమీపంలోని ఉన్న వ్యవసాయ బావుల వద్ద నుండి నీటిని తెచ్చుకుని వాడుతున్నామని దాని ద్వారా కలుషిత మంచినీటితో పెద్దలతో పాటు పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామంలో ఎక్కడా పారిశుద్ధ్య కార్యక్రమాలు కాని సైడు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమలు విఫరీతంగా పెరిగి ఇలాంటి దుర్భరజీవితం ఎప్పుడు చూడలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో మూడు నెలల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు ఎదుర్కొడమే కాకుండా సమీపంలో రైతు వ్యవసాయ బోరు నుంచి బిందెలతో నిత్యం మంచినీటి కోసం పోవాల్సి వస్తుందని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు మిషనర్ భగీరథ నీళ్లు అందుతుంటే మా తండాకు మాత్రం మంచినీటి ఎద్దడి ఏంటని స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. మూడు జిల్లాలకు ఎంతో ప్రాముఖ్యతను కలిగిన సోలిపురం గ్రామపంచాయతీలో బోయపాడు దర్గా కలదు. ప్రతి శుక్రవారం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు తండోపతండాలుగా వచ్చిమొక్కులు చెల్లించుకుని తమకు తోచినంత దర్గా నిర్వాహకులకు తమ ముడుపుల ద్వారా నగదును చెల్లిస్తారు. అలా చూసుకుంటే సంవత్సరానికి రూ.20లక్షల నుంచి రూ.30లక్షల ఆదాయం వస్తుంది. ప్రతి సంవత్సరం వేలం పాట నిర్వహిస్తారు. అక్కడి దర్గా నిర్వాహకులు గ్రామ పెద్దలు ఒక తాటిపై ఉండి వేలం పాట నిర్వహించేంది గోప్యంగా ఉంచి ప్రజలకు తక్కువ రేటును నమ్మబలికించి మిగితా సొమ్మును సొంతం చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా గ్రామస్తులు ఈ విషయం తెలియకపోవడం గమనార్హం. కనీసం మంచినీటి సౌకర్యం లేక గిరిజన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే గ్రామంలో స్వార్ధ ప్రజాప్రతినిధులు ఉండటం వలన గ్రామ అభివృద్ధి కుంటు పడుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే సోలిపురం బోయపాటి దర్గా ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామపంచాయతీ ఖజానాకు మళ్లీంచాలని తద్వారా గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించవచ్చునని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయాన్ని గతంతో దర్గా నిర్వాహకుడు ముజేను సంప్రదించగా దర్గాకు ఎవరికి సంబంధం లేదని మా పూర్వీకుల ద్వారా ఈ ఆచారం ఉందని, దర్గా ఆదాయం మా సొంతమని చెప్పడం విడ్డూరంగా ఉంది. దీనిపై స్థానిక అధికారులు వెంటనే స్పందించి ఎండోమెంట్ ద్వారా లేక గ్రామపంచాయతీ కార్యాలయానికి నగదు మళ్లీంచి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# నిరుపేదల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం : పాయం





**ప్రజాపక్షం/కరకగూడెం:** ఉపాధి హామీ పని పథకం ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీ నే అని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కరకగూడెం మండలం బట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదిక కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఉపాధి హామీ కార్మికులకు పనిముట్లు పంపిణీ, ఇందిరమ్మ ఇంటి పట్టాలు, కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుపేదలు ఆదాయం సమకూర్చడంలో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉపాధి కూలీలకు నిరంతరం పని కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మండలంలో మొదటి విడతలో భాగంగా 321 ఇండ్లకు పనులు ప్రారంభించడం జరిగిందని అని ఆయన తెలిపారు. ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించే బాధ్యత నాది అని ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఎటువంటి కష్టాలు లేకుండా చూస్తానని అని అన్నారు. అర్హులందరికీ ఐదు లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణం జరుగుతుందని పేద ప్రజల కళ్ళల్లో ఆనందం చూడడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదింటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు అత్యధిక మెజార్టీతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు సామాగ్రిని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గంట ప్రతాప్, ఎంపీఓ మారుతి , ఏపీఓ భాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ కాంతయ్య, ఆర్ఐ కృష్ణ ప్రసాద్, టీపీసీసీ సభ్యులు చందా సంతోష్ కుమార్, మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, సీనియర్ నాయకులు పోలేబోయిన తిరుపతయ్య, ఎర్ర సురేష్, తోలేం నాగేశ్వరరావు, 16 గ్రామ పంచాయతీల నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మేయర్ పునుకొల్లు నీరజ మంగళవారం శంకుస్థాప న చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. తొలి జాబితాలో గుడిసెల్లో ఉండే నిరుపేదలకు ప్రాధాన్యత కల్పించి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం కల్పిస్తుందన్నారు. కార్పోరేషన్ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు బుజ్జి, సరిత, ప్రసాద్, యాకూబ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డును సందర్శించిన రీజినల్ డైరెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (వరంగల్) రీజినల్ డైరెక్టర్ సయ్యద్ మసూద్ సందర్శించారు. మంగళవారం రీజినల్ డైరెక్టర్ సయ్యద్ మసూద్ డంపింగ్ యార్డును సందర్శించి అక్కడ జరుగుతున్న బయో మైనింగ్ పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డి మాట్లాడుతూ బయో మైనింగ్ ద్వారా డంపింగ్ యార్డులో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించడం, పర్యావరణానికి హాని కలుగకుండా చూడటం ప్రధాన ఉద్దేశమన్నారు. అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. పనులు వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం డిఎంగా శివప్రసాద్ బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టిజిఎస్ ఆర్టిసి ఖమ్మం డిపో మేనేజర్‌గా మేడా శివప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న శివ ప్రసాద్ ఖమ్మం డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. ఖమ్మం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న దినేష్‌కుమార్ బదిలీపై కామారెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, వారి సహకారంతో మహాలక్ష్మి లందరూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులకు సరిపడ బస్సులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

## ప్రమాదకరంగా పాడుబడ్డ పాత బావి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పాత ఎర్రబోయినపల్లిలో ఆర్.సి.యం చర్చి వీధిలో తాళ్ల నర్సమ్మ ఇంటి సమీపంలో గత 20 సంవత్సరాల క్రితం నిర్మించిన పాత బావి పాడు బడి డ్రైనేజీలో వదిలి పెట్టడం వలన అది పూర్తిగా బహిరంగంగా బయట ఉండటం వలన రహదారిపై రాకపోకలు సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని, చిన్న పిల్లలు పెద్దలు తిరిగే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున దానిని పూడ్చాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శిని కోరుతున్నారు. ఈ విషయమై కార్యదర్శిని వివరణ కోరగా త్వరలో పాత బావిని పూడ్చివేస్తామని పేర్కొన్నారు.

## బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/ వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలో రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్ వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నవరాత్రుల నేపథ్యంలో ప్రతి రోజు రాత్రి సమయంలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు మహిళలు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో బతుకమ్మ ఘాట్ చుట్టూ ఇబ్బందులు లేకుండా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఘాట్ వద్ద పారిశుధ్య నిర్వహణ, ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ గురులింగం శానిటేషన్ అధికారి వీరన్న తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఘాట్ వద్ద తగు ఏర్పాట్లు చేశామన్నారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర విద్యనందించడమే లక్ష్యం



**-ఎఫ్ఎల్ఎన్ తనిఖీలు వంద శాతం పూర్తి చేయాలి**
**-విద్యాశాఖపై కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పాఠశాలల్లో పిల్లలకు సమగ్ర విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఎఫ్ఎల్ఎన్, ఆధార్, అపార్ అప్‌డేషన్, ఎఫ్ఆర్ఎస్, భవిత సెంటర్, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై కలెక్టర్ చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని కలెక్టర్ తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ అమలులో ఖమ్మంజిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని దీనికి కృషి చేసిన అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. మన జిల్లాలో 90 శాతం ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు జరిగేలా కృషి చేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో ఎఫ్ఆర్ఎస్ అమలు జాబితాలో క్రింది నుంచి ఉన్న పది కాంప్లెక్స్ సిఆర్‌పిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాథమిక విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించేందుకు చేపట్టిన ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎంఈవో, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు వారి పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేస్తూ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ అమలును పరిశీలించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ డిసెంబర్ చివరి నాటికి ఖమ్మంజిల్లా విద్యార్థుల ఎఫ్ఎల్ఎన్ మరింత మెరుగయ్యేలా చూడాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ తనిఖీల జాబితాలో క్రింది నుంచి ఉన్న ఐదు మండలాలు వచ్చే సమావేశం నాటికి ఇంప్రూవ్ కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నెల రోజుల లోపు వంద శాతం తప్పని సరిగా ఆధార్ కార్డు, అపార్, కుల ధృవీకరణ పత్రం, బర్త్ సర్టిఫికెట్ ఉండాలని దీనికి అనుగుణంగా అన్ని చర్యలు తీసుకోవాలని మండలాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు నేర్పే అంశాలు జీవితాంతం ఉపయోగపడతాయన్నారు. ఖమ్మం జిల్లాలో 28 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ విద్యా వ్యవస్థ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిందన్నారు. దసరా సెలవుల్లో అవసరమైన మరమ్మతు పనులు పూర్తి చేసిన తర్వాత పండుగ వాతావరణంలో ప్రీ ప్రైమరీ విద్యా సంస్థలను ప్రారంభోత్సవం చేయాలన్నారు. ఆయాల ఎంపిక పారదర్శకంగా జరగాలని పాఠశాలల్లో మరమ్మతులకు గురైన కంప్యూటర్లను బాగు చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పిఎం పోషణ్, మధ్యాహ్న భోజన పథకం క్రింద ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలన్నారు. రెండవ జత ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వచ్చే మార్చి నాటికి డైట్ భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. 20 భవిత సెంటర్లలో చేపట్టిన మరమ్మతు పనులు అక్టోబర్ 15 నాటికి పూర్తి చేయాలన్నారు. ఐదవ తరగతి లోపు పిల్లలకు రోజు ఒక గంట సమయం రీడింగ్ స్కిల్స్ పెరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, మండల నోడల్ అధికారులు, సిఆర్‌పిలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నవంబర్ 14న ఢిల్లీలో ఉపాధ్యాయుల ర్యాలీ

**-సుప్రీం తీర్పును పునః సమీక్షించాలి**
**-ఎస్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నవంబర్ 14న ఢిల్లీలో భారీ ఉపాధ్యాయ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎస్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ సమస్యలను తీసుకెళ్లి పరిష్కార మార్గానికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఎస్టియు ఖమ్మంజిల్లా కౌన్సిల్ సమావేశం మంగళవారం ఎస్టియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దొడ్డా వరప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సదానంద గౌడ్ మాట్లాడుతూ సుప్రీం తీర్పు మరియు ఎన్‌సిటిఈ ఆదేశాలను బట్టి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు టిఈటి ఉత్తీర్ణత పొంది ఉండాలని లేదంటే రెండేళ్లలో ఉత్తీర్ణత సాధించలేకపోతే నిర్బంధ ఉద్యోగ విరమణ చేయాలనడం సరికాదన్నారు. ఇటువంటి అసమాంజసమైన ఉత్తర్వులు ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నాయని సదానంద గౌడ్ తెలిపారు. ఉద్యోగ విరమణ చేసి 18 మాసాలు గడుస్తున్నా వారికి రావాల్సిన బెనిఫిట్స్‌ను అందించకపోవడం శోచనీయమన్నారు. ఒక పెన్షనర్లకే రాష్ట్ర ప్రభుత్వం రూ. 8వేల కోట్లు బకాయి ఉందని బకాయిలను వెంటనే విడుదల చేయాలని 2023 జులై నుండి ఇవ్వాల్సిన పే రివిజన్ ఉత్తర్వులు మరియు పెండింగ్‌లో ఉన్న ఐదు డిఏలను వెంటనే విడుదల చేయాలని కొత్త పింఛన్ స్థానే పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్ కార్యదర్శి పోల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఖరామత్ అలీ, ఆర్థిక శాఖ కార్యదర్శి శ్రీధర్‌బాబు, సంఘ బాధ్యులు జానకిరాణి, మాలిని, షేక్ సైదా, బానోత్ రాము తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



**- రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి**
**- ఎస్‌పి రోహిత్ రాజ్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కోడిపందాలు, పేకాట, బెట్టింగ్‌లు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారమైన కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణ విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. మంగళవారం ఆయన బూర్గంపాడు, దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ల పరిసరాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతరాష్ట్ర దొంగల ముఠాల కదలికలపై నిఘా పెట్టి కట్టడికి కృషి చేయాలన్నారు. అధికార రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి తగిన చర్యలు చేపట్టాలన్నారు. నేనే సైతం కార్యక్రమంలో భాగంగా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పెండిగ్ కేసుల పరిష్కారానికి ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, గంజాయి అక్రమ రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, గంజాయి సేవించే ప్రదేశాలను గుర్తించి పెట్రోలింగ్ చేపట్టాలని ఆదేశించారు.

## రేవంత్, భట్టి చిత్రపటాలకు పాలాభిషేకం



**ప్రజాపక్షం/భద్రాచలం :** మైనార్టీల సంక్షేమం కోసం సిఎం రేవంత్ రెడ్డి నూతన పథకాలు ప్రారంభించడాన్ని హర్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చిత్ర పటాలకు మంగళవారం అటవీ అభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పట్టణ ముస్లిం మైనారిటీ అధ్యక్షులు అలీం మాట్లాడుతూ ఇందిరా మైనార్టీ మహిళా యోజన పథకం ఒంటరి, వింతతు, అనాథ, అవివాహిత మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇందులో భాగంగా రూ.50వేల సహాయం అందిస్తారని చెప్పారు. అక్టోబర్ 6వ తేది నుండి ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకానికి అక్టోబర్ 6వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్కె ఉస్మాన్, ఎస్‌కె అలీం, ఖాసీం, పాషా, సైరుద్దీన్,మస్తాన్, సయ్యద్ యాకూబ్ పాషా, భార్గవ్, పవన్ కుమార్, రమేష్, ఎండి బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దిపల్లిలో హెల్త్ క్యాంపు

**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మణుగూరు పరిధిలో గల వలస ఆది వాసి గిరిజన గ్రామమైన పెద్దిపల్లి లో మంగళవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. క్షేత్ర స్థాయి లో గృహ సందర్శన చేసి మలేరియా, డెంగీ జ్వారాల పై అవగాహనా కల్పిస్తూ, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, గుంతల లో యాంటి లార్వాల్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిశాంత్ రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వీరాస్వామి, హెల్త్ అసిస్టెంట్ లు రాంప్రసాద్, కృష్ణ, శైలజ, వెంకటమ్మ, రోజా పాల్గొన్నారు.

## దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భవాని నవరాత్రి వేడుకలు



**ప్రజాపక్షం/కూసుమంచి:** స్థానిక మండల కేంద్రమైన కూసుమంచి గ్రామంలో శ్రీ దుర్గా మాత ఉత్సవ గౌడ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. కూసుమంచి గ్రామంలో విగ్రహ దాత పుణ్య దంపతులు అర్వపల్లి నాగేంద్రప్రసాద్ నాగమణి దంపతులు తొలి రోజు పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అర్వపల్లి నాగేంద్ర ప్రసాద్, నామణి దంపతులు మాట్లాడుతూ అత్యంత భక్తీ శ్రద్ధలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు సజావుగా సాగాలని, ఆ అమ్మ వారి ఆశీస్సులు ఎల్లవేళలా మీ అందరికీ ఉండాలని అమ్మవారిని వేడుకుంటున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో విగ్రహ దాత పుణ్య దంపతులు నాగేంద్రప్రసాద్, నామణి, మంద నాగులు, మంద రాంబాబు, మంద నాగేశ్వరరావు, మంద చంద్రశేఖర్, మంద ప్రసాద్, అర్వపల్లి సాయి, అర్వపల్లి ఉదయ్, మందగని నరేష్, మల్లేష్, ఉపేందర్, మంద పెద్ద వెంకన్న, మంద చిన్న వెంకన్న, తాళ్లపల్లి ఉపేందర్, మధు, మోహన్‌రావు, జానకి రామ్, సుమన్, నగేష్, వీరస్వామి గౌడ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాసుదేవరావును కలిసిన వాసవి జర్నలిస్టుల ఫోరం బాధ్యులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావును వాసవి జర్నలిస్టుల ఫోరం బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదుమూరు భద్రయ్య, సంతోష్‌చక్రవర్తి, నూకల రామచంద్రమూర్తి, వందనపు సామ్రాట్, వందనపు ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో వ్యక్తి దారుణ హత్య

**- నిందితుల కోసం పోలీసుల గాలింపు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం నడిబొడ్డున సోమవారం అర్ధరాత్రి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు ఇనుప రాడ్లతో తలపై బలంగా కొట్టి హతమార్చారు. దీంతో కొత్తగూడెం పట్టణం ఒక్క సారిగా ఉలిక్కి పడింది. వివరాల ప్రకారం, స్థానిక 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ టెంపుల్ ఏరియాలో ఉంటున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగి వీసంశెట్టి రామ్మోహన్ రావుపై దుండగులు అర్ధరాత్రి దాడికి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న రామ్మోహన్ రావుని మాట్లాడే పనుందని బయటకు పిలిచి భార్య చూస్తుండగానే అప్పటికే వారితో తెచ్చుకున్న ఇనుప రాడ్‌తో తలపై బలంగా మోదారు. తీవ్ర రక్త స్రావం అవుతున్నప్పటికీ చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత హంతకులు అక్కడి నుండి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. కాగా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ హత్యకు ఆస్తి తగాదాలు, అక్రమ సంబంధాలే కారణమా అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. సంఘటనలపై ఎస్పి రోహిత్ రాజ్ నిందితుల కోసం డిఎస్‌పి రెహమాన్ నేతృత్వంలో బృందాన్ని ఏర్పాటు చేశారు. దుండగుల కోసం పోలీసులు పెద్ద ఎత్తున గాలింపు చేపట్టారు.